# పడమటి సంధ్యారాగం

ప్రాణ స్నేహితురాలు సంధ్య అమెరికానించి శెలవలకి వచ్చిందని తెలియగానే, పరుపరుగున వాళ్ళింటికి వచ్చింది శ్యామల.

"ఏమే ఆరేళ్ళ తర్వాత ఇప్పుడా రావటం? బాగున్నావా? బాగా సన్న బడ్డావ్ సరిగ్గా తినటం లేదా? మీ ఆయనా పిల్లలూ అందరూ బాగున్నారా? అమెరికాలో జీవితం ఎలా వుంది? నేనసలు గుర్తున్నానా? ఆఁ పాత ఫ్రెండే కదా అని మర్చిపోయావా?" అన్ని ప్రశ్నలూ గుక్కతిప్పుకోకుండా ఒక్కసారే అడిగేసింది శ్యామల, సంధ్యని ఎగాదిగా చూస్తూ.

సంధ్య చిన్నగా నవ్వుతూ "నా సంగతేమో కానీ, నువ్వు మాత్రం ఏమీ మారలేదే. గొడగొడా మాట్లాడటం. హడావిడి పడిపోవటం. బాగున్నావా?" అని శ్యామల చేయి పట్టుకుని మృదువుగా నిమిరింది.

ఇద్దరూ డాబా మీదకి వెళ్ళి అక్కడ గట్టుమీద కూర్చున్నారు. ఆకాశంలో సూర్యుడు వేడి తగ్గించుకుంటూ, పడమటి దిశ వేపు ప్రయాణం చేస్తున్నాడు.

శ్యామల అడిగిన అన్ని ప్రశ్నలకీ జవాబులు చెప్పింది సంధ్య.

కాస్సేపయాక "నిన్నొక విషయం అడగాలనివుంది. అడగనా?" అంది శ్యామల.

సంధ్య నవ్వి "ఇందాకటినించీ చాల విషయాలు అడిగావ్. ఇంకోటే కదా దాందేం భాగ్యం. అడుగు" అంది.

"ఏం లేదూ. నాకూ అమెరికా వచ్చేయాలనివుంది. మా ఆయన్ని ఎంతో పోరు పెడుతున్నాను... నువ్వే మంటావ్?" అడిగింది కొంచెం బిడియపడుతూ.

సంధ్య నవ్వి "అదేమిటే... ఇప్పటిదాకా లొడలొడా వాగావ్... అంతలో చల్లారిపోయావ్... " అంది.

"వయసు నలభై నాలుగు దాటిందిప్పుడేమిటీ ఆలోచన అంటావేమోనని"

"నేను అమెరికా వెళ్ళాక మొట్టమొదట నేర్చుకున్నది. ఎవరన్నా ఏదన్నా చెబితే వాళ్ళ అభిప్రాయాలు వినటం. నా అభిప్రాయాలు వాళ్ళు అడిగితేనే, అవి నా అభిప్రాయాలుగా మాత్రమే, చెప్పటం. ఎవరి నిర్ణయాలు వాళ్ళే తీసుకోవటం అవసరం. కనుక నీ మనసులోని మాట చెప్పాలనివుంటే, మొహమాటం లేకుండా చెప్పు. వింటాను" అంది సంధ్య.

ఆమె మాటలకి ఉత్సాహం తెచ్చుకుంటూ అంది శ్యామల. "కారణాలు మూడు. ఒకటి, ఆయన ఇరవైఏళ్ళ పైగా ఉద్యోగం చేస్తున్నా వెనకేసింది ఏమీలేదు. ఎప్పుడూ ఒకటో తారీకుకోసం ఎదురుచూడటమే. రెండు: ఈఊళ్ళో ప్రతి రోడ్డుకీ ఒకళ్ళున్నారు అమెరికాలో. మేమేమీ వాళ్ళకి తీసిపోం. మూడు: సిగ్గు లేకుండా చెబుతున్నాను ఏమీ అనుకోకు. అమెరికాలో సుఖాలని కొన్నాళ్ళు అనుభ

వించాలని వుంది"

ఆమె చెప్పిన మాటల వెనుక భావాలు అర్థం చేసుకుంటూ అడిగింది సంధ్య, "వచ్చి ఏం చేయాలని? ముందు చదువా? ఉద్యోగమా? దాని గురించి ఏమాలోచించారు?" అడిగింది.

శ్యామల నవ్వింది. "ఇప్పుడు ఈ వయసులో చదువేమిటి నా ముఖం. ఆయనకి నలభై ఆరేళ్ళు దాటాయి. ఏదన్నా ఉద్యోగంలోనే చేరాలని"

"ఇక్కడ ఆయన ఉద్యోగం చేసేది కాలేజీలో లెక్చరర్‌గా. అక్కడా అదే చేయాలనా?"

"అసలు విషయం చెప్పనా. ఆయనకి అమెరికా వెళ్ళటం అసలు ఇష్టం లేదు. అదంతా నేను గట్టిగా పట్టుపట్టటం వల్లనే"

సంధ్య అడిగింది. "మరి నీకు ఇండియా అన్నా, భారతీయ సంస్కృతి అన్నా చాల అభిమానం కదా. నేను మా ఆయనతో అమెరికా వెళ్ళిపోతుంటే - అదేమిటే మన దేశం వదిలి వెళ్ళిపోతున్నావని బాధ పడ్డావు కదా.... "

"నీ కింకా గుర్తుందే. అది ఇరవై ఏళ్ళ క్రితం. ఆ రోజులు వేరు. ఇప్పుడిక్కడ పరిస్థితుల్ని చూస్తే... అప్పుడు వెళ్ళి నువ్వు మంచి పని చేశావనిపిస్తుంది... "

సంధ్య మళ్ళీ నవ్వింది. "అక్కడి మా జీవితం గురించి నీకేం తెలుసని, నేను వెళ్ళి మంచి పని చేశానని అంటున్నావ్?" అడిగింది.

"ఏం మీకక్కడ సుఖంగా లేదా?" సూటిగా అడిగింది శ్యామల.

"ఉంది. లేదు. అది నువ్వు ఎటునించీ చూస్తున్నావన్న దాని మీద ఆధార పడి వుంటుంది"

"నువ్వెప్పుడూ ఇంతేనే! ఏదో ఎనలిస్ట్‌గా రెండు పక్కలనించీ మాట్లాడుతుంటావ్. అడిగిన ప్రశ్నకి జవాబు చెప్పకుండా"

"అవును మరి. ఫైనాన్షియల్ ఎనలిస్ట్‌గా పనిచేస్తున్నానుగా. అన్ని కోణాల్లోనించి చూడద్దూ... ఓ.కే. సీరియస్‌గా నువ్వడిగిన ప్రశ్నకి జవాబు చెబుతాను ఇలా ఒక సంస్కృతిలోనించి, పూర్తిగా వేరుగావున్న ఇంకో సంస్కృతిలోకి వెళ్ళి జీవితం ప్రారంభించినప్పుడు మనకెంతో నచ్చిన కొన్నిటిని వదులుకోవాలి. మనకి అసలు నచ్చని కొన్నిటిని ఒప్పుకోవాలి. అలా చేయకుండా రెంటికీ చెడ్డ రేవడలా జీవించటం చాల కష్టం. ఆ వదులుకున్నవి మధురస్మృతులలాగా వెంటబడి బాధ పెడుతుంటాయి. ఆ ఒప్పుకున్నవి కొండొకచో ఇబ్బంది పెడుతుంటాయి. ఆ రెండింటినీ ఎలా బాలన్స్ చేస్తావన్నదాన్ని బట్టి నీ సుఖాలు, కష్టాలు వుంటాయి"

శ్యామల ఒక్కక్షణం ఆలోచనలో పడింది. "నువ్వు చెప్పింది నాకు పూర్తిగా అర్థమయింది. కానీ అక్కడికి వెళ్ళేటప్పుడు ఒక కమిట్‌మెంట్‌తో వెడతాం. ఆ కమిట్‌మెంట్ ధృడంగా వుంటే, మళ్ళీ వెనకడుగు ఎందుకు వేస్తాం?"

సంధ్య నవ్వింది. "వెనకడుగు వెయ్యం కాబట్టే నేను చెప్పిన సుఖాలూ కష్టాలూ మనన్ని బాధపెట్టేది. ఉదాహరణకి ఇండియాలో అందరికీ దూరమయిపోతాం. పెళ్ళిళ్ళూ పెటాకులే కాదు మన దగ్గరివాళ్ళు చనిపోయినా చివరిచూపు

చూసుకోటానికి కూడా వీల్లేదు. మా వూళ్ళో మూర్తిగారు ఫోన్‌లో ఇండియాలో వాళ్ళమ్మగారితో మాట్లాడుతున్నప్పుడే ఆవిడ చివరి శ్వాశ వదిలింది. ఈయన ఫోన్‌లో తీగలకి ఇవతల, ఏం చేయాలో తెలీక విలవిలలాడాడు. అలాగే నీలాటి మన స్నేహితులందరికీ దూరమయిపోయాం. పండగలూ పబ్బాలూ ఆ సరదాలె పోయాయి. మా వూరి తెలుగు అసోషియేషన్ వాళ్ళేదన్నా ప్రోగ్రాం పెడితేనే, ఆ పండగలు గుర్తుకొచ్చేది. నా కెంతో ఇష్టమైన తెలుగు సాహిత్యానికీ, పుస్తకాలకీ దూరమయిపోయాను. ఎప్పుడన్నా ఇలా ఇండియా వచ్చినప్పుడు తీసుకెళ్ళే పుస్తకాలు చదవటానికి సమయం దొరక్క అలా పడి వుంటాయి. ఉద్యోగాలున్నంత కాలం డొక్కాడుతుంది. మనం బాగా పనిచేస్తున్నా, ఎన్నో కారణాలవల్ల ఉద్యోగాలు పోతుంటాయి. అదొక పెద్ద టెన్షన్. పిల్లలు పెళ్ళి వయసుకొచ్చారంటే అదొక టెన్షన్. తెలుగువాళ్ళని కాకపోయినా, కనీసం ఇండియన్స్‌నన్నా చేసుకుంటే బాగుంటుందని చాలమంది పెద్దవాళ్ళ కోరిక. మా జీవితం మాది, మా పెళ్ళి మా కొదిలేయండి అనే పిల్లలు. ఏ దేశం, ఏ రంగు వాళ్ళని తీసుకొస్తారో తెలీదు. మెహతాగారి అబ్బాయి, వాళ్ళ నాన్న గుజరాతీ అమ్మాయిని చూపిస్తే కాదని ఒక తెల్ల బ్బాయిని, తెల్లమ్మాయిని కాదు, అబ్బాయిని పెళ్ళి చేసుకున్నాడు. ఇలా ఎన్ని ఉదాహరణలు చెప్పమంటావు. ఇవన్నీ ఆలోచిస్తుంటే నేను చేసినది మంచిపనికాదే మోననిపిస్తున్నది..."

ఆలోచిస్తున్న శ్యామల ఒక్కక్షణం ఆగి అన్నది. "నువ్వు చెప్పినవన్నీ ఇక్కడా జరుగుతున్నవే. గౌహతిలో ఉద్యోగం చేసే మా శేషగిరి, రెండేళ్ళ కొక సారి ఆంధ్రా వస్తాడు. మీకు ప్లేన్‌లో రావటానికి ఎంత టైమ్ పడుతుందో, అతనికి రైల్లో రావటానికి అంతే టైమ్‌పడుతుంది. ఇక్కడా తెలుగు మాట్లాడటం తగ్గిపోతున్నది. ఆ చెత్త సినిమాలు, పిచ్చి టీవీ సీరియల్సూ రావటం మొదలుపెట్టేక పుస్తకాలు చదివేవాళ్ళు తగ్గిపోయారు. మన స్నేహితులంటావా, అందరూ తలో దిక్కుకీ వెళ్ళి పోయారు. అమెరికానించీ వస్తున్న నిన్ను కనీసం ఐదేళ్ళకోసారి చూస్తున్నాను. మన సుమిత్రనీ, ప్రమీలనీ చూసి దశాబ్దాలయింది. రోజురోజుకీ పెరిగిపోతున్న ధరలూ, ఈ రాజకీయ దుర్గంధం, లంచాలూ చూస్తుంటే పిచ్చెత్తుతుంది. ఇక్కడ ఉద్యోగాలున్నా, ఈ జీవిత పోరాటంలో టెన్షనే. ఇప్పుడున్నంతమతాభిమానం, కులాభిమానం, దురభిమానమనాలేమో మన తెలుగుదేశ చరిత్రలోఎన్నడూ లేదు. కాణికి ఠికాణా లేని వెధవకూ్కడా, మగమహారాజు కనుక, లక్షల్లో కట్నం కావాలి. అమెరికాకి అప్పనంగా పంపించే మామ కావాలి. అందుకే అనిపిస్తున్నది, ఏమిటి ఇక్కడ వుండి మేం బావుకుంటున్నది? అమెరికాకి వెడితే సుఖంగా వుంటుంది కదా అని" శ్యామలని వింతగా చూసింది సంధ్య. సంధ్యని సాలోచనగా చూసింది శ్యామల.

ఎర్రటి సూర్యుడు పసుపుపచ్చగా మారి పడమటి ఆకాశంలోకి మాయమవుతున్నాడు.

* * *